PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 140 | 05 శనివారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

## రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే

- బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు నేను ముందే చెప్పాను..
- ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజా సీమ)**



"కేసీఆర్‌కు ముందే చెప్పాను. రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చో వాల్సిందే" అని ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం సైదాబాద్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాము గతంలో బీఆర్ ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చా మని, అది నిజం అన్నారు. కానీ తాను పదే పదే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా చెబుతూనే ఉండేవాడినన్నారు.

...మిగతా 2 లో...

## భారత్ మమ్మల్ని ముందే హెచ్చరించింది...

- రాజకీయ ఒత్తిడికీ గురయ్యే పరిస్థితి వచ్చింది
- బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4(ప్రజా సీమ)**



చైనాపై ఎక్కువగా ఆధారపడిన యూరప్.. ఇప్పుడు దాని ప్రభావాలను ఎదుర్కొంటోందని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ అన్నారు. ఈ విషయంలో భారత్ మమ్మల్ని ఎప్పుడో హెచ్చరించిందని, అప్పట్లో తాము పట్టించుకోలేదని ఆయన అంగీకరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కి వచ్చిన బార్ట్ డి వెవర్..

...మిగతా 2 లో...

## సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్...

- కేసు నమోదు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్4(ప్రజా సీమ)**



సాధారణంగా ముఖ్యమంత్రులకు భద్రత చాలా కట్టుదిట్టంగా ఉంటుంది. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటించిన సమయంలో బందోబస్తుకు సంబంధించిన అత్యంత రహస్య వివరాలను సోషల్ మీడియాలో బహిర్గతం చేసిన ఘటనలో కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ భద్రతా వివరాలను పోస్ట్ చేసినందుకుగానూ తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతా నిర్వాహకులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ...మిగతా 2 లో...



## ఆంధ్రా పేపర్ మిల్స్‌పై ఇక ఉపేక్షించం

- మిల్స్ యాజమాన్యంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం

**అమరావతి, సెప్టెంబర్ 3 (ప్రజా సీమ)**

ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి వద్ద గోదావరి నది కాలుష్యం కావడానికి ఆంధ్రా పేపర్ మిల్సే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. నదిలోకి కాలుష్యాన్ని విడిచిపెడుతూ పన్నులు మాత్రం ఎగ్గొడుతున్నారంటూ మండి పడ్డారు. 'ఆంధ్రా పేపర్ మిల్స్.. పన్నులు చెల్లించి పుష్కరకాలం దాటి ంది. పన్నులు చెల్లించమంటే కోర్టుల కెళ్లి కాలయాపన చేస్తున్నారు. పన్నులు చెల్లించేందుకు ఇంతటి బాధ్యతా రాహిత్యం ఎందుకు?

...మిగతా 2 లో...

# పల్లె చెరువులకు కొత్త కళ

- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ
- ఇప్పటికే 26 చెరువులకు పునరుజ్జీవం
- భూగర్భ జలాల పెంపు..
- సమగ్ర అభివృద్ధే ధ్యేయం
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు, చిల్డ్రన్ పార్కులతో కొత్త రూపు
- సెప్టెంబర్ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం

**మంగళగిరి, సెప్టెంబర్ 4 (ప్రజా సీమ) :**



సాగు నీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధిపై లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవకు 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన' పథకం తోడవడంతో రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది. శ్రీ పవన్ కళ్యాణ్ గారి దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి.

### 105 చెరువులు... రూ. 50 కోట్ల అంచనా వ్యయంతో పనులు

రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడనున్నాయి.× చెరువులకు కొత్త రూపు.. ప్రజలకు కొత్త సౌకర్యాలుచెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చెరువుల సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తూ, వాటిని ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన కేంద్రాలుగా పరిధిలోని పందూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలో గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం తదితర చెరువులు పూర్తి స్థాయి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి, రాష్ట్రంలో అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.



## కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్

**అమరావతి, సెప్టెంబర్ 4(ప్రజా సీమ) :**

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు.

# పెట్టుబడుల వేట.. వ్యక్తిగత అంశాలు:

## విజయ్ తొలి విదేశీ పర్యటనపై తమిళనాట చర్చ

- సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి విదేశీ పర్యటన
- ఈ నెల 10 నుంచి 16 వరకు బ్రిటన్ లో పర్యటించనున్న విజయ్
- భార్య, కుమార్తెలను విజయ్ కలుస్తాడంటూ ప్రచారం



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తన తొలి అధికారిక విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన ఈ నెల 10 నుంచి 16 వరకు బ్రిటన్ లో పర్యటించనున్నారు. లండన్‌లో జరిగే పలు కీలక పారిశ్రామికవేత్తల సమావేశాల్లో పాల్గొని ఉన్నత స్థాయి చర్చలు జరపనున్నారు.అయితే, ఈ పర్యటన కేవలం అధికారిక కార్యకలాపాలకే కాకుండా ఆయన వ్యక్తిగత జీవితా వార్తలు జోరుగా వినిపిస్తున్న నేపథ్యంలో, లండన్‌లో నివసిస్తున్న భార్య సంగీత, కుమార్తె దివ్యలను ఆయన ఈ పర్యటనలో కలుసుకోనున్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఇదే సమయంలో నటి త్రిష కూడా ఓ షూటింగ్ నిమిత్తం యూరప్‌లోనే ఉండటంతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి, రాష్ట్రంలో పెట్టుబడులు సాధించే ముఖ్యమైన లక్ష్యంతో పాటు వ్యక్తిగత జీవితపు ప్రాధాన్యతల నడుమ సీఎం విజయ్ తొలి విదేశీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# సరికొత్తగా హస్త కళలు

- ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయల కళారూపాలు
- కళారూపాల తయారీలో 770 మంది కళారులకు శిక్షణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహణ
- రూ.1.35 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- క్లస్టర్ల వారీగా శిక్షణ కార్యక్రమాలు
- 200 మందికి శిక్షణతో పాటు టూల్ కిట్ల అందజేస్తాం
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



**అమరావతి, సెప్టెంబర్ 4(ప్రజా సీమ)**

మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి. హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.35 కోట్లను వెచ్చించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770 మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివృత్తులకు అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతిగాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.1,35,16,314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.1.01 కోటి నిధులు మంజూర య్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా శిక్షణివ్వనున్నట్లు వెల్లడించారు. ...మిగతా 2 లో...

# సరికొత్తగా హస్త కళలు

మొదటిపేజీ తరువాయి

గురు-శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురు-శిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు.

## 200 మందికి శిక్షణతో పాటు పనిముట్లు

గురు-శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా చెక్క బ్లాక్ తయారీ, కలంకారి బ్లాక్ ప్రింటింగ్, దుర్గి రాతి శిల్పం, అగరుబత్తి తయారీ, తాటి ఆకుల కళ, కొబ్బరి చిప్పల కళ, శ్రీకాళహస్తి కలంకారి వంటి హస్తకళలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా చెక్క శిల్పం, టెర్రకోట బొమ్మలు, లేస్/హ్యాండ్‌మేడ్ నిటెడ్ గూడ్స్, అల్లగడ్డ రాతి శిల్పం, శ్రీకాళహస్తి కలంకారి, వెదురు-చెరకు కళలు, సవర గిరిజన చిత్రకళ, బొబ్బిలి వీణ, ఇమిటేషన్ జ్యువెలరీ తదితర కళారూపాల తయారీపై మరో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వారిలో అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 50 మంది చొప్పున 200 మంది అరటి ఫైబర్, చెరకు-వెదురు, వుడ్ టర్నింగ్, ల్యాకర్‌వేర్, దుర్గి రాతి శిల్ప కళాకారులకు శిక్షణతో పాటు ఇంప్రూవ్డ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్(ఐటీడీపీ) ద్వారా పనిముట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఈశిక్షణా కార్యక్రమాలు కృష్ణా, గుంటూరు, ఎన్‌టీఆర్, అనకాపల్లి, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, తూర్పు గోదావరి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, పల్నాడు తదితర జిల్లాల్లోని కళాకారులకు ఉపయోగపడనున్నాయని మంత్రి తెలిపారు.

## కళాకారుల ఆదాయం పెంపే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, కళాకారుల ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. సంప్రదాయ కళలను కాపాడుతూ ఆధునిక డిజైన్లు, మెరుగైన శిక్షణ, నాణ్యమైన పనిముట్లు అందించడం ద్వారా హస్తకళాకారులకు ఆర్థికంగా మరింత వెన్నుదన్నుగా ఉండేలా ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. త్వరలోనే ఈ శిక్షణా కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించనున్నామని మంత్రి సవిత తెలిపారు

# సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్...

మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు. మొదట ఈ ఫిర్యాదుతో జులై 14న ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సమగ్ర విచారణ కోసం ఈ కేసును సిటీ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి రీ-రిజిస్టర్ చేశారని సమాచారం. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 13న సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనకు సంబంధించిన నిమిషాల వారీ పూర్తి షెడ్యూల్, భద్రతా ఏర్పాట్లపై ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ఆర్‌జీఐఏ, డీజీపీ వంటి ఉన్నతాధికారులకు ఒక వైర్‌లెస్ సందేశం ద్వారా సమాచారం పంపాం. జెడ్ ప్లస్ (౦) కేటగిరీ భద్రతకు అనుగుణంగా చేసిన ఈ ఏర్పాట్ల సందేశంలో సీఎం బ్లడ్ గ్రూప్, సీఎస్‌వో ఫోన్ నంబర్ వంటి అత్యంత సున్నితమైన అంశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటన కొనసాగుతుండగానే ఈ అత్యంత రహస్య వైర్‌లెస్ సమాచారాన్ని తెలుగు స్క్రైబ్ అనే ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి భద్రతాపరమైన వివరాలన్నీ బహిర్గతమయ్యాయి. నిబంధనల ప్రకారం వైర్‌లెస్ సందేశాలను బయటకు పొక్కనివ్వకూడదు. అయితే అధికారుల్లో ఎవరైనా అక్రమంగా ఈ సమాచారాన్ని ఆ సోషల్ మీడియా ఖాతాకు చేరవేసి ఉంటారని సీఎస్‌వో తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. ఈ విధి నిర్వహణలో తలెత్తిన లోపం, సీఎం రేవంత్ భద్రతా ఉల్లంఘనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. జూన్ 14న ఖైరతాబాద్ పీఎస్‌లో కేసు నమోదుకాగా, సమగ్ర దర్యాప్తు కోసం సైబర్ క్రైమ్ విభాగానికి కేసు బదిలీ చేసి రీ రిజిస్టర్ చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# కేసీఆర్ చాలా మంచోడు

## హుందాగా రిసీవ్ చేసుకునేవారు

## కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,సెప్టెంబర్3(ప్రజా సీమ)

: మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.



# కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు..

రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22ఏ నిరోధిత భూముల వివాదంపై మంత్రి స్పందిస్తూ... ఈ సమస్య ముమ్మాటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే ఉత్పన్నమైందని మండిపడ్డారు. ఆనాటి జీవోను పునఃపరిశీలించి, సవరణలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా నిరోధిత జాబితా చిక్కులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించిన మంత్రి వివేక్, ఈ వైఫల్యంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గత పదేళ్ల స్వార్థ పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని ఆయన వ్యాఖ్యానించారు.

# రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి.

## మల్లికార్జున్ ఖర్గే ని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పోరాడుతోంది

## ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

కామారెడ్డి, సెప్టెంబర్4 (ప్రజా సీమ)

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేరిపై కుల వివక్షకు పాల్పడిన ఘటనను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. దేశంలో కుల వివక్షకు, అంటరానితనానికి, మనిషిని మనిషిగా తక్కువ చేసి చూసే విధానాలకు స్థానం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగా జలాలతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఘటన తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. ఖర్గే ఒక దళిత నాయకుడు కావడం వల్ల ఆయన పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని భావించడం అత్యంత దురదృష్టకరం. ఇది కేవలం ఖర్గే ని అవమానించడం కాదు.. రాజ్యాంగాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అవమానించడమే అని షబ్బీర్ అలీ అన్నారు. కులం మనిషి పుట్టుకను నిర్ణయించవచ్చు కానీ అతని గౌరవాన్ని నిర్ణయించదు. ప్రతి భారతీయుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని ఎవరూ కాలరాయలేరుఅని అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతును అక్రమ కేసులతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని షబ్బీర్ అలీ ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించడం రాహుల్ గాంధీ హక్కు. ప్రశ్నించే గొంతును కేసులతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత బలంగా ప్రజల మధ్య నిలబడతారు. రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి" అని డిమాండ్ చేశారు.ఖర్గే ని అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు. ప్రజల కోసం పనిచేయని నాయకుడికి ప్రతిపక్ష నాయకుడి పదవి ఎందుకు ప్రజల సమస్యలను పట్టించుకోని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయాలి" అని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. కామారెడ్డి ప్రజలను కేసీఆర్ క్షమాపణ కోరాలని అన్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేసిన కేసీఆర్.. ఈ ప్రాంత ప్రజలకు ఏం చేశారు వారి సమస్యల గురించి అసెంబ్లీలో ఏం మాట్లాడారు ప్రజలకు చెప్పాలి. వరదలు, భారీ వర్షాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సమయంలో బాధితులను పరామర్శించడానికి కూడా కేసీఆర్ రాలేదు. కేటీఆర్ రాలేదు. బీఆర్ఎస్ నాయకత్వం ప్రజల పక్కన నిలబడలేదు" అని విమర్శించారు. "బీఆర్ఎస్ ఖాతాలో వందల కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని చెబుతున్నారు. కామారెడ్డిలో పోటీ చేసిన కేసీఆర్ ఆ నిధుల నుంచి ఈ ప్రాంత ప్రజలకు ఎంత సహాయం చేశారు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా. ప్రజలు దీనిపై సమాధానం కోరుతున్నారు" అని షబ్బీర్ అలీ ప్రశ్నించారు.

# కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్

ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మొదటిపేజీ తరువాయి

# రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోండి.. లేకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని చెప్తుండేవాడనన్నారు. "ఇప్పుడు ముఖ్యమైన విషయం ఏమిటంటే... సీఎం సాబ్, మీరు కాస్త మరీ ఎక్కువ మర్యాదస్తుడిగామారిపోయారు. కాస్త మీ పాత దూకుడు చూపించండి, ప్రజల్లోకి రండి. మిమ్మల్ని ఏ విషయం ఆపుతోందో నాకైతే అర్థం కావడం లేదు. హనుమంతరావు సాబ్, మీరేమైనా చెబుతారా వచ్చి? నేను చెప్పింది తప్పు కాదు కదా? మీరు కూడా నాతో ఏకీభవిస్తున్నారు కదా... మీరు ఒప్పుకుంటున్నారు... మీరొక సీనియర్ నాయకులు, మీరే ఒప్పుకున్నారంటే ఇక అంతే, నేను సరైన మాటే చెప్పాను. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్ మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, యావత్ తెలంగాణ రాష్ట్రం సంపూర్ణ ప్రగతి సాధించాలని మేము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము" అని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆయన సోదరుడు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీపై ప్రశంసలు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఓవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమనే ప్రచారం కేవలం కొందరి దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారి తీశాయి. అసదుద్దీన్ ఓవైసీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్బరుద్దీన్ ఓవైసీ, అసదుద్దీన్ ఓవైసీలతో కలిసి పాతబస్తీ అభివృద్ధిపై చర్చించినట్లు చెప్పారు. గతంలో ఎంతమంది సీఎంలు ఓల్డ్ సిటీకి వచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పాతబస్తీ అభివృద్ధికి అసదుద్దీన్ ఓవైసీ ఏ ప్రతిపాదన తీసుకొచ్చినా పరిశీలించి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు చెప్పారు.

# భారత్ మమ్మల్ని ముందే హెచ్చరించింది...

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. తక్కువ ధరలకే విదేశీ వస్తువులు యూరప్ మార్కెట్‌లోకి భారీగా రావడం వల్లే అక్కడి స్థానిక పరిశ్రమంలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గడిచిన కాలం యూరప్‌కు ఒక మేలకొలుపు. చాలా కాలంగా తక్కువ ధరలకు భారీగా వస్తువులు మా మార్కెట్‌లోకి వచ్చాయి. దాంతో మా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి పెరిగింది. చివరికి ఆ ఆధారపడటాన్నే రాజకీయ ఒత్తిడికి ఉపయోగించే పరిస్థితి వచ్చింది" అని డివెవర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా చైనా పేరును ప్రస్తావించలేదు, కానీ చైనా నుంచే యూరప్ మార్కెట్‌లోకి చౌకధరల వస్తువులు రావడంతో.. ఆయన చైనాను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు అందరికీ అర్థమవుతోంది. "మే గుర్తించకముందే భారత్ ఈ ప్రమాదాన్ని చూసింది. మమ్మల్ని హెచ్చరించింది. కానీ మేమే వినలేదు" అని డి వెవర్ ఒప్పుకొన్నారు. ఒక దేశంపై ఆర్థికంగా ఎక్కువగా ఆధారపడటం భవిష్యత్‌లో రాజకీయ ఒత్తిడికి కారణమయ్యే అవకాశం ఉందని ఇప్పుడు యూరప్ గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా యూరప్‌ను చాలా కాలం కిందటే హెచ్చరించారని గుర్తు చేశారు. మీ ప్రధాని చాలా కాలం కిందటే యూరప్‌ను హెచ్చరించారు. కానీ అప్పట్లో ఎవరూ ఆయన మాట వినలేదు. ఇప్పుడు మేం వింటున్నాం" అని బెల్జియం ప్రధాని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌ను అత్యంత ముఖ్యమైన, నమ్మకమైన భాగస్వామిగా బెల్జియం చూస్తోందన్నారు. అదేవిధంగా పాకిస్థాన్‌కు కీలకమైన సైనిక సామగ్రి ఇవ్వబోమంటూ ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ - బార్ట్ డి వెవర్ సమావేశాల సందర్భంగా భారత్ - బెల్జియం రక్షణ రంగ సంస్థల మధ్య పది ఒప్పందాలు కుదిరాయి.

# ఆంధ్రా పేపర్ మిల్స్‌పై ఇక ఉపేక్షించం

మొదటిపేజీ తరువాయి

తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చినా స్పందించడం లేదు. నోటీసు పంపి 3 నెలల సమయం ఇచ్చినా కనీస స్పందన లేదు. ఆంధ్రా పేపర్ మిల్స్‌పై ఇక ఉపేక్షించం.. కఠిన చర్యలు తీసుకుంటాం' అని పవన్ పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర పర్యావరణ శాఖామంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గోదావరి నది జలాల కాలుష్యంపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెల్సిందే. దీంతో ఆయన గోదావరి నది ఒడ్డున ఉన్న పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థజలాలను స్వయంగా పరిశీలించి, ఈ వ్యవర్థాలో గోదావరి జల్లాల్లో విడుదలకాకుండా తగిన చర్యలు తీసుకునేలా ఆయా కంపెనీల యాజమాన్యానికి సమయం ఇచ్చారు. అయినప్పటికీ ఆంధ్రా పేపర్ మిల్స్ వంటి పలు యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి కోర్టురను ఆశ్రయించి కాలయాపన చేస్తున్నాయి.

# సంపాదకీయం

## ఏఐకి పెరిగిన ఆదరణ

నేటి యుగంలో ఏఐకి ఆదరణ బాగా పెరింగిందని చెప్పుకోవాలి. ప్రతీ సంస్థ దాదాపు ఏఐపై ఆధారపడటం మేదలు పెట్టాయి. ఆ దిశగా భారతదేశంలో 2024-2026 మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాల జీతాలు 23 శాతం పెరిగాయని, అదే సమయంలో కొన్ని సాంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల జీతాలు తగ్గాయని, ఇది ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసాన్ని పెంచుతోందని తెలిపింది. జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, గత సంవత్సరం ఏఐ రంగం వార్షిక ప్రాతిపదికన 12 శాతం జీతాల వృద్ధిని నమోదు చేసింది. ఇది పరిశీలించిన విభాగాలలో అత్యధికం. దీని తర్వాతి స్థానాల్లో కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ-సెమీకండక్టర్స్ చెరో 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. గత రెండేళ్లుగా కంప్యూటర్ హార్డ్‌వేర్ మరియు ఇ-కామర్స్ వంటి రంగాలలో జీతాలు తగ్గుముఖం పట్టగా, ఐటీ సేవల రంగంలో జీతాలు స్తంభించిపోయాయని నివేదిక పేర్కొంది. 0-3 సంవత్సరాల అనుభవం ఉన్న ఎంట్రీ-లెవల్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 8.87-15.41 సంపాదిస్తుండగా, 15 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్నవారికి ఇది రూ. 70.99-89.24 లక్షల వరకు పెరుగుతుంది. ఏఐ వేతనాలు ప్రాంతాన్ని బట్టి గణనీయంగా మారుతూ ఉంటాయి. ఇది ప్రత్యేక నైపుణ్యం ఉన్న యజమానులు, పరిణతి చెందిన టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లు ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయో ప్రతిబింబిస్తుంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ-కేంద్రీకృత స్టార్టప్‌లు, ప్రపంచ సామర్థ్య కేంద్రాల సాంద్రత కారణంగా, బెంగళూరు భారతదేశంలో అత్యధిక వేతనాలు ఇచ్చే మార్కెట్‌గా కొనసాగుతోంది. బెంగళూరులో సీనియర్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 61.70-91.25 లక్షలు సంపాదిస్తున్నారు. ఇది ఎన్‌సిఆర్ లేదా ముంబై కంటే సుమారు 10-15 శాతం ఎక్కువ, సీనియర్ స్థాయిలో చెన్నై కంటే 40 శాతం వరకు అధికం. విస్తరిస్తున్న జిసిసి, ఉత్పత్తి ఇంజనీరింగ్ పెట్టుబడుల మద్దతుతో హైదరాబాద్ దీనికి గట్టి పోటీదారుగా ఎదుగుతోంది. సైబర్‌సెక్యూరిటీ రంగంలో గరిష్ట వేతన పరిమితి సంవత్సరానికి రూ. 97.81 లక్షలు, ఇది పరిశీలించిన అన్ని విభాగాలలోకెల్లా అత్యధికమని నివేదిక పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-ఐటి సర్వీసెస్‌లో ప్రారంభ వేతనం సంవత్సరానికి రూ. 2.68-5.08 లక్షలతో మొదలై, 15 ఏళ్లకు పైబడిన వారికి సంవత్సరానికి రూ. 57.55--72.13 లక్షలకు చేరుకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ రెండు విభాగాలలోనూ వేతనాల్లో 1 శాతం తగ్గుదల నమోదైంది. కంపెనీలు దేనికి అధిక వేతనం చెల్లించాలనే విషయంలో ఎంపిక చేసుకుంటున్నాయి. కేవలం అనుభవం మాత్రమే ఇకపై అత్యధిక జీతాల పెంపును అందించడం లేదు. ఒక నైపుణ్యం వ్యాపారానికి అవసరమైన సామర్థ్య లోపాన్ని పూరిస్తుందా లేదా అన్నదే ముఖ్యం. అది ఏఐ వ్యవస్థలను నిర్మించడం, మౌలిక సదుపాయాలను భద్రపరచడం, ఫ్యాక్టరీలను ఆటోమేట్ చేయడం లేదా ప్రత్యేకమైన ఆరోగ్య సంరక్షణను అందించడం వంటివి కావచ్చునని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా అన్నారు. వ్యాపార అవసరాలు మారుతున్న కొద్దీ, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ, నవీకరించుకునే వారి జీతాలు కూడా క్రమంగా పెరుగుతాయని నిపుణులు అర్థం చేసుకోవాలని సిన్హా అన్నారు. టెక్నాలజీ రంగం వెలుపల జీతాల పెరుగుదల, కొత్త సామర్థ్యాలను పెంపొందించుకునే రంగాలలో కేంద్రీకృతమై ఉంది. గత రెండేళ్లలో, సెమీకండక్టర్ల రంగంలో 17 శాతం (మొదట 7 శాతం, ఆ తర్వాత 9 శాతం), ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో 13 శాతం (మొదట 5 శాతం, ఆ తర్వాత 8 శాతం) జీతాలు పెరిగాయి. ఈ రెండూ గత రెండేళ్లలో మరింత వేగవంతమయ్యాయి. ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌లో సీనియర్ జీతాలు రూ. 58.90 లక్షల వార్షిక ప్యాకేజీకి, సెమీకండక్టర్లలో రూ. 48.49 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరుకున్నాయి. గత ఏడాది ఆటోమోటివ్ రంగం 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. మెడికల్ ప్రాక్టీస్ రంగంలో 8 శాతం జీతాల పెరుగుదల, సీనియర్ జీతాలు రూ. 56.70 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరాయి. దీని తర్వాత మెడికల్ డివైసెస్ రంగంలో 6 శాతం, ఫార్మాస్యూటికల్స్ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. ఇక ఇదే కోణంలో ఏఐ కి ఆదరణ పెరిగితే ఆ రంగంలో రాణించే నిపుణులకు తిరుగుండదనేది నిపుణుల వాదన.

# పిఠాపురం ఆడపడుచులకు శ్రీ పవన్ కళ్యాణ్ శ్రావణ మాస కానుక



ప్రముఖ శక్తి పీఠమైన శ్రీ పురుహూతిక







10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలు పంపిణీ

శ్రీ పురుహూతిక అమ్మవారి సన్నిధిలో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణతో ప్రారంభమైన వరలక్ష్మీ వ్రత మహోత్సవం

భక్తుల సౌకర్యార్థం పకడ్బందీ ఏర్పాట్లు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న నియోజకవర్గ మహిళలు

పిఠాపురం (ప్రజా సీమ )

ప్రజలతో, ముఖ్యంగా నియోజకవర్గంలోని ఆడపడుచులతో తనకున్న అనుబంధాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ మరోసారి చాటి చెప్పారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా నియోజకవర్గంలోని దాదాపు 10 వేల మంది ఆడపడుచులకు చీరలు, పసుపు, కుంకుమలను శ్రావణ మాస కానుకగా అందించారు. పిఠాపురంలోని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆడపడుచుల కోసం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. వ్రతానికి అవసరమైన పూజా సామగ్రిని ఉచితంగా అందించడంతో పాటు, వేద పండితుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది మంది మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొని అమ్మవారిని పూజించారు.

**భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాచరణ**

శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ కుక్కుటేశ్వర స్వామి, శ్రీ పురుహూతిక అమ్మవారి దివ్యక్షేత్రంలో వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో వ్రత పూజల్లో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వరలక్ష్మీ దేవిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు శ్రీ తుమ్మల రామస్వామి (బాబు), పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ శ్రీ కళ్యాణం శివ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శ్రీ పెండెం దొరబాబు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం గణపతి పూజ, కలశ పూజతో పాటు అమ్మవారికి అష్టోత్తర శతనామావళి, వరలక్ష్మీ స్తోత్రాలు, షోడశోపచార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వరలక్ష్మీ వ్రత మహిమను వివరిస్తూ వ్రతకథను భక్తులకు వినిపించారు. నాలుగు విడతలుగా జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రత పూజల్లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది మహిళలు పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, ఆలయ మరియు మున్సిపల్ సిబ్బంది, జనసేన పార్టీ వాలంటీర్లు, సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందించేందుకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని కూడా అందుబాటులో ఉంచారు.

**ఐదు విడతలుగా వరలక్ష్మీ వ్రతమాచరించిన మహిళలు**

వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించేందుకు వేలాది మంది మహిళా భక్తులు తరలిరావడంతో వేద పండితులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మహిళలతో ఐదు విడతలుగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరింపజేశారు. తొలి విడతలో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రెండో విడతను ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించారు. మూడో విడతలో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, నాలుగో విడతలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, ఐదో విడత 10 గంటల నుంచి 11 వరకు వేద పండితులు మహిళలతో వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహింపజేశారు. ఏటా జరిగే విధంగానే సంప్రదాయాన్ని గౌరవిస్తూ సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించిన ఆడపడుచులకు శ్రీ పవన్ కళ్యాణ్ పసుపు, కుంకుమ, చీరలను కానుకగా పంపించారు.

ఈ కానుకలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే శ్రీ పంతం నానాజీ , పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు శ్రీ తుమ్మల రామస్వామి , పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ శ్రీ కళ్యాణం శివ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శ్రీ పెండం దొరబాబు, ఫైవ్ మెన్ కమిటీ సభ్యుడు శ్రీ ఓదూరి కిశోర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీమతి చల్లా లక్ష్మి, జనసైనికులు, వీరమహిళలు పర్యవేక్షించారు.

# శ్రీకృష్ణ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నేతల ప్రత్యేక పూజలు

- హాజరైన సమన్వయకర్త ఎస్.నిస్సార్ అహ్మద్

మదనపల్లె (ప్రజా సీమ) :

జగద్గురు భగవాన్ శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలోని అనపగుట్ట గోవర్ధనగిరిపై వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎస్.నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో పార్టీ నాయకులు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి,ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. అలాగే రాష్ట్రంలో కరువుకాటకాలు తొలగిపోయి, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు,ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి తిరిగి 2029లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి,రాష్ట్రంలో సంక్షేమ పాలనను పునరుద్ధరించాలని శ్రీకృష్ణ స్వామివారిని ప్రార్థించినట్లు నిసార్ అహ్మద్ తెలిపారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా ధర్మం,న్యాయం,సత్యం వైపు ప్రజలకు మార్గనిర్దేశం చేశారని,ఆయన ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు రావాలని ఆకాంక్షించారు. కృష్ణాష్టమి పర్వదినం ప్రజల జీవితాల్లో శాంతి,సౌభాగ్యం,సంతోషం నింపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు అనూషా రెడ్డి,జింకా చలపతి,మాజీ మున్సిపల్ చైర్మన్ మనుజా



రెడ్డి,మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి,మాజీ సర్పంచ్ వలసపల్లి నాగరాజ రెడ్డి,ముజీబ్,శీలం రమేష్,ఆలయ కమిటీ చైర్మన్ గురుశంకర్ యాదవ్, సభ్యులు రెడ్డెప్ప యాదవ్,శంకర్ యాదవ్,బాలచంద్ర యాదవ్,మహేష్ యాదవ్ ,చలపతి యాదవ్,అమరనాథ రెడ్డి,కొత్తపల్లి నాగార్జున నాయుడు,మాధవ రెడ్డి,ఆవుల విశ్వనాథ్,శారదా రెడ్డి,వినుతా బాయి,ముజీబ్ తదితర నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దపల్లి పంచాయతీలో జోరుగా సాగిన టీడీపీ ఇంటింటి ప్రచారం

సిద్ధవటం (ప్రజా సీమ )



రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్మోహన్ రాజు ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్ క్లస్టర్ ఇంచార్జ్ రాజా నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం, ప్రజలకు పార్టీ సిద్ధాంతాలు మరియు కార్యక్రమాలను చేరువ చేయాలనే లక్ష్యంతో సిద్ధవటం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమం జోరుగా సాగింది . ఈ సందర్భంగా భాకరాపేట,11 బెటాలియన్ ఎదురుగా, శివునిపల్లి, మిట్టపల్లి, పేరయ్యగారి పల్లి, కనుమలోపల్లి, మలినేనిపట్నం గాంధీనగర్, ఎగువ హరిజనవాడ,దిగువ హరిజనవాడ, కొత్త హరిజనవాడ, రామస్వామి పల్లె, జేఎంజే కాలేజ్, గ్రామాలతో పాటు పలు ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. పార్టీ విధానాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. "ప్రతి ఇంటికి తెలుగుదేశం -- ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమం" అనే నినాదంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు నాగముని రెడ్డి మండల ఐటీడీపీ అధ్యక్షులు హరిప్రసాద్ భాకరాపేట సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్ నాయుడు ఓబులేసు శివునిపల్లి సీనియర్ టిడిపి నాయకులు సుబ్బయ్య యాదవ్, బాలినేని సుబ్బరాయుడు, రెడ్డయ్య నాయుడు, దశరథ రామానాయుడు, (దిలీప్ ) చరణ్,నరేంద్ర తదితర మండల తెలుగుదేశం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసీమ

# కూటమి ప్రభుత్వం పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి

## కబేళాలకు తరలుతున్న పాడి పశువులు.. రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి

**పీలేరు ప్రజాసీమ :**

ఎల్‌నినో ప్రభావంతో సరైన వర్షాలు లేక, పంటలు చేతికందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో పశువులను పోషించడం కూడా భారంగా మారింది. పొలాల్లో పచ్చగడ్డి లేకపోవడం, బోర్లు ఉన్నా నీటి లభ్యత తగ్గిపోవడంతో పాడి పశువులకు మేత, నీరు అందించలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే పంటలు సరిగా పండక ఆర్థికంగా నష్టపోయిన రైతులకు పశువుల పోషణ అదనపు భారంగా మారింది. రోజురోజుకూ పశు గ్రాసం ధరలు పెరుగుతుండటంతో పశు వులను పోషించలేక కొందరు రైతులు వాటిని తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పాడి పశువులు కబేళాలకు తరలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో చంద్రబాబు ప్రభుత్వం పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేసిందిఇలాంటి కరువు, వర్షాభావ పరిస్థితులు గతంలో ఎదురైన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పశువులను కాపాడేందుకు పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచిందని రైతులు గుర్తుచేస్తున్నారు. పశు వులకు అవసరమైన పచ్చగడ్డి, ఎండుగడ్డి తదితర పశుగ్రాసాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి పాడి పశువులను కాపాడేందుకు చర్యలు చేపట్టిన సందర్భాలను వారు ప్రస్తావిస్తున్నారు .ప్రస్తుతం కూడా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గతంలో మాదిరిగానే కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల వారీగా పశుగ్రాస కొరతను గుర్తించి అవసరమైన మేరకు గడ్డి సరఫరా చేయడంతో పాటు పశువులకు తాగునీరు, పశువైద్య సేవలు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పశుసంపదను కాపాడితేనే రైతుకు భరోసారైతులకు పంటలతో పాటు పశుపోషణ కూడా ప్రధాన జీవనాధారం. పంటలు దెబ్బతిన్న సమయంలో పాడి పశువుల ద్వారా వచ్చే ఆదాయం రైతు




కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసాను అందిస్తుంది. అలాంటి పశువులను కూడా రైతులు కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.కాబట్టి ప్రభుత్వం పరిస్థితిని ముందుగానే గుర్తించి పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఉచితంగా లేదా సబ్సిడీపై పశుగ్రాసం అందించాలని రైతులు కోరుతున్నారు. పశువులకు అవసరమైన మందులు, టీకాలు, పశువైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.కబేళాలకు తరలకుండా పశు వులను కాపాడాలిపంటలు పండక, పశు వులకు గడ్డి దొరకక రైతులు తమ పాడి పశువులను అమ్ముకునే పరిస్థితి రాకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా పీలేరు నియోజకవర్గంలోని వర్షాభావ ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# బీసీ వర్గాల అభివృద్ధికి సబ్సిడీ రుణాలు అందించాలి

### - బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సరితకు డాక్టర్ నవీన్ కుమార్ వినతి

**రాజంపేట (ప్రజా సీమ):**

రాజంపేట నియోజకవర్గంలోని బీసీ కులాల్లో వెనుకబడిన వర్గాల ప్రజల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం నుంచి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరుతూ డాక్టర్ నవీన్ కుమార్.. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సరితను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా రాజంపేట ప్రాంతంలో బీసీ వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాజంపేటలో అత్యధికులు చేతివృత్తులు, చిన్నతరహా వ్యాపారాలపైనే ఆధారపడి జీవిస్తున్నారని, తగిన పెట్టుబడి సహాయం లేకపోవడంతో వారు ఆర్థికంగా స్థిరపడలేకపోతున్నారని తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబాలకు ప్రభుత్వ పరంగా చేయూతనిచ్చి, స్వయం ఉపాధి మరియు వ్యాపారాల అభివృద్ధి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ నవీన్ కుమార్ విజ్ఞప్తిపై మంత్రి ఎస్. సరిత సానుకూలంగా స్పందించారని తెలిపారు.

**ప్రజాసేవే ధ్యేయం -- పోటీకి సిద్ధం:**

రాజంపేట ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ప్రజాసేవే తన ప్రధాన ధ్యేయమని డాక్టర్ నవీన్ కుమార్ స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో



మున్సిపల్ చైర్మన్ పదవి ఓసీ కేటగిరీకి కేటాయిస్తే, రాజంపేట పట్టణ సర్వాంగీణ అభివృద్ధి కోసం పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు భాషనేని వెంకటేశ్వర్లు నాయుడు, టీడీపీ నాయకులు శ్రీధర్ నాయుడు, ఉదయ్ దగ్గుపాటి తదితరులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలు మండలానికి ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులు

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దాసం శ్రీనివాస్, కె. దొంగయ్య ఎంపిక

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ)**

గొల్లప్రోలు, గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఏపీ మల్లవరం ఎంపీపీ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న శ్రీ కె. దొంగయ్య, గొల్లప్రోలు ఈబీసీ మోడల్ ప్రాథమిక పాఠశాల నంబర్--1లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న శ్రీ దాసం శ్రీనివాస్ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. వీరు శనివారం (05.09.2026) కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకోనున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇరువురికీ అభినందనలు తెలిపారు. సవాళ్లను చిరునవ్వుతో ఎదుర్కోవడం.. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం శ్రీ దాసం శ్రీనివాస్ నైజమని తోటి ఉపాధ్యాయులు కొనియాడారు. గొల్లప్రోలు ఈబీసీ మోడల్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి, విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రైవేటు పాఠశాలలతో పోటీగా నిర్వహించిన కార్యక్రమాలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తూ పలువురు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆయన సేవా దృక్పథం ఉపాధ్యాయ లోకానికి గర్వకారణమని తెలిపారు. మండలంలో విద్యాభివృద్ధికి చేపట్టిన అనేక





కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసిన శ్రీ దాసం శ్రీనివాస్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల గొల్లప్రోలు ండల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన కీర్తి కిరీటంలో మరెన్నో అవార్డులు చేరాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

# గోవర్ధనగిరిలో అట్టహాసంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### - స్వామివారిని దర్శించుకున్న తంబళ్లపల్లి టిడిపి ఇన్చార్జి జి.శంకర్ యాదవ్

### - ఘనస్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లి పట్టణం,అనపగుట్ట,గోవర్ధనగిరిలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ పరమాత్ముని ఆలయంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు తంబళ్లపల్లి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు గురు శంకర్ యాదవ్,సభ్యులు మాజీ ఎమ్మెల్యేకి అపూర్వ స్వాగతం పలికారు.ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించి,స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జి.శంకర్ యాదవ్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లోనే మదనపల్లి శ్రీకృష్ణుడి ఆలయం ప్రసిద్ధి గాంచిందన్నారు.ప్రతి ఏడాది ఇక్కడ శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతాయన్నారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది అత్యద్భుతంగా వేడుకలు సాగాయన్నారు.స్వామివారి కృపాకటాక్షాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని,తంబళ్లపల్లి నియోజకవర్గంలో వర్షాలు సమృద్ధిగా కురిసి సస్యశ్యామలంగా మారాలని ఆకాంక్షించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జి.శంకర యాదవ్ ని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



# గోకులంలో ఆధ్యాత్మిక శోభ.

## భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

### వైభవంగా రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కళ్యాణం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు

**రాజంపేట (ప్రజా సీమ):**

నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి, అరవపల్లి గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ముగిశాయి. కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని ఆలయాల్లో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవాన్ని పురోహితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ కన్నులపండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి, స్వామివారి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా యల్లటూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఇంట ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు విలసిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొనడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.







# తపస్యలో పండుగ వాతావరణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### - అలరించిన విద్యార్థినీ,విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

**మదనపల్లె (ప్రజా సీమ)**

: పీలేరు నియోజకవర్గం,కలికిరి మండలం,రెడ్డివారి పల్లి నందు గల తపస్య విద్యాసంస్థలో కరస్పాండెంట్ రామాంజులు నాయుడు,క్యాంపస్ ఇంచార్జ్ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఇందులో భాగంగా విద్యార్థులు కృష్ణుడు,గోపికల వేషాలతో అలరించారు.పాఠశాల ఆవరణమంతా పండుగ వాతావరణం నెలకొన్నది. కొందరు విద్యార్థులు చిన్ని కృష్ణయ్యను తలుస్తూ నృత్య ప్రదర్శన చేశారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ భారతదేశం సర్వమత సమ్మేళనమని సంస్కృతి,సాంప్రదాయాలు ఆచారాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని,ఆలోచన నైపుణ్యం పెంపొందించు కోవాలని, విద్యార్థులందరూ మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు.తమ పాఠశాలలో క్రమశిక్షణ, నాణ్యమైన విద్యాబోధన అందించడంతోపాటు జాతీయ పండుగలు,సాధారణ పర్వదినాలు నిర్వహించి విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.అనంతరం శ్రీ కృష్ణుడికి ప్రీతీకరమైన అటుకుల ప్రసాదం ఉపాధ్యాయులు,విద్యార్థులకు పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవి,ప్రేమలత,ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు,విద్యార్థినీ,విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.






# వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా మారాలి

## - టిడిపి నేత సుకుమార్ బాబు దంపతులు ప్రత్యేక పూజలు

మదనపల్లె (ప్రజా సీమ)

: శ్రీకృష్ణ పరమాత్ముడి కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి ఏపి సస్యశ్యామలంగా మారాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత,విశ్రాంత డీఎస్పీ కనుమకుంట సుకుమార్ ఆయన సతీమణి మాజీ కౌన్సిలర్ సులోచనలు పేర్కొన్నారు.శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమని పురస్కరించుకొని వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సుకుమార్ బాబు మాట్లాడుతూ ముందుగా ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శు భాకాంక్షలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం సర్వతోముకాభివృద్ధి సాధిస్తోందన్నారు.ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాలు అనుకున్న స్థాయిలో కురవలేదని తద్వారా కొన్ని ప్రాంతాల్లో నీటికొరత ఏర్పడిందన్నారు.శ్రీకృష్ణుడి కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి,పంటలు బాగా పండాలని తద్వారా ప్రతి ఇంట సిరిసంపదలు తులతూగాలని ఆకాంక్షించారు.ప్రజల ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకొని సంతోషంగా జీవించాలన్నారు.కూటమి పాలనలో రాష్ట్రంలో ఆలయాలు మహర్దశ సంతరించుకుంటున్నాయ న్నారు.ముఖ్యంగా ఆలయాల నిర్మాణం,మరమ్మత్తులకు పెద్దపీట వేస్తోందన్నారు.పుంగనూరు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



# మదనపల్లె నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడిగా బాలు నియామకం

## - శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే,పార్టీ శ్రేణులు

మదనపల్లె (ప్రజా సీమ) :



మదనపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఐటీడీపీ అధ్యక్షుడిగా బాలు నియమితులయ్యారు.మదనపల్లె శాసనసభ్యులు ఎం.షాజహాన్ బాషా ఆదేశాలు,ఆశీస్సులతో తనను ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు బాలు తెలిపారు.ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం తాను చేసిన సేవలను గుర్తించి,తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి,తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్,రాజంపేట పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షులు కౌశిక్ రెడ్డి,టిడిపి యువనేత జునైద్ అక్బరీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.ఐటీడీపీ అధ్యక్షుడిగా తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని బాలు స్పష్టం చేశారు.పార్టీ విధానాలు,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.నాయకులు,కార్యకర్తలు తనకు సహకరంతో నియోజకవర్గంలో ఐ.టి.డి.పి విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.కాగా నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులుగా ఎంపికైన బాలుకు ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా,యువనాయకుడు జునైద్ అక్బరీ,పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

# పుల్లంపేటలో ఆస్టర్ నారాయణాద్రి మెగా హెల్త్ క్యాంపు విజయవంతం

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:



పుల్లంపేటలో శ్రీ భువన ఫస్ట్ ఎయిడ్ సెంటర్ మరియు మధు మెడికల్స్ ఆధ్వర్యంలో, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, తిరుపతి నిర్వహించిన మెగా ఉచిత హెల్త్ క్యాంపు విజయవంతంగా జరిగింది.ఈ శిబిరంలో ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ అర్జున్ జనరల్ ఫిజీషియన్ బృందంతో పాటు వాసన్ ఐ కేర్ హాస్పిటల్ కు చెందిన డాక్టర్ కీర్తి, డాక్టర్ అల్తాఫ్ భాష ఆప్తమాలజిస్టులు తమ వైద్య బృందంతో పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.సుమారు 120 మంది హెల్త్ చెకప్ చేయించుకోగా, వారిలో 30 మందికి కంటి శుక్లాలు మరియు ఇతర కంటి సమస్యల కారణంగా శస్త్రచికిత్స అవసరమని గుర్తించి తదుపరి చికిత్స కోసం రిఫర్ చేశారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన చికిత్స త్వరగా తీసుకోవాలని వైద్యులు సూచించారు.

ఈ సందర్భంగా ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వైద్యులు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను బట్టి భవిష్యత్తులో మరోసారి కూడా హెల్త్ క్యాంపు నిర్వహించి సేవలు అందిస్తామని తెలిపారు.



# సికింద్రాబాద్‌లో ఆర్మీ అటాచ్మెంట్ క్యాంప్

## - మిట్స్ ఎన్‌సీసీ క్యాడెట్ల అద్భుత ప్రతిభ

## - అభినందించిన ఛాన్సలర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు సికింద్రాబాద్‌లోని 20 మద్రాస్ రెజిమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్మీ అటాచ్మెంట్ క్యాంప్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని వైస్ ఛాన్సల్లర్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో క్యాడెట్లు ఎ.మహియా,కె.రంజిత మరియు బి.శ్యామల వివిధ సైనిక శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.క్యాంప్‌లో భాగంగా క్యాడెట్లు భారత సైన్యంలో జీవన విధానం,క్రమశిక్షణ,శిక్షణా పద్ధతులు,విధి నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యక్ష అవగాహన పొందడంతోపాటు తమ ప్రతిభ,క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు.భారత సైన్యంలో వినియోగించే ఏకే-47,రాకెట్ లాంచర్,ఎస్ఎల్ఆర్,ఇన్‌సాస్,ఎల్ఎంజీ వంటి వివిధ ఆయుధాలపై అవగాహన పొందారు.ఆధునిక డ్రోన్ సాంకేతికత,సైనిక కార్యకలాపాల్లో డ్రోన్ల వినియోగం,ఆధునిక యుద్ధరంగంలో వాటి ప్రాధాన్యత గురించి క్యాడెట్లు తెలుసుకున్నారు.క్యాంప్‌లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించడం మిట్స్ ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభకు,క్రమశిక్షణకు,అంకితభావానికి నిదర్శనమని తెలిపారు.ఆర్మీ అటాచ్మెంట్ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సల్లర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి,ప్రో ఛాన్సల్లర్ ఎన్.ద్వారకానాథ్,వైస్ ఛాన్సల్లర్ డాక్టర్ సి.యువరాజ్,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల,అధ్యాపకులు మరియు విద్యార్థులు అభినందించారు.క్యాడెట్లకు నిరంతరం ప్రోత్సాహం,మార్గదర్శకత్వం,సహకారం అందించిన చిత్తూర్ 35 (ఏ) ఆంధ్ర



బెటాలియన్ ఎన్సీసీ విభాగం మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పి.లోకనాథన్ లకు మిట్స్ యాజమాన్యం మరియు ఎన్‌సీసీ ఏఎన్ఓ కెప్టెన్ ఎన్.నవీన్ కుమార్లు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజా దర్బార్'






## - తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు

రాజంపేట (ప్రజా సీమ):

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటికి తక్షణ పరిష్కారం చూపడానికే 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అధిష్ఠానం ఆదేశాల మేరకు 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి చమర్తి జగన్ మోహన్ రాజు స్వయంగా అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా దర్బార్ ద్వారా స్వీకరించిన అర్జీలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు సైతం ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, ఒకవేళ ఏదైనా సమస్య పరిష్కారానికి సాంకేతిక అవరోధాలు ఉంటే ఆ విషయాన్ని బాధితులకు స్పష్టంగా వివరించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంని చేసుకోవడమే లక్ష్యం





## - పదవులు అలంకారప్రాయం కాదు బాధ్యత

## - మదనపల్లె వైకాపా సమన్వయకర్త నిసార్ అహ్మద్ స్పష్టం

మదనపల్లె (ప్రజా సీమ) :

అన్నమయ్య జిల్లా,పీలేరు పట్టణంలోని ఎం.ఎస్.ఆర్ గార్డెన్స్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం విజయవంతంగా జరిగింది.పీలేరు మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మదనపల్లె నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ఎస్.నిసార్ అహ్మద్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర,జిల్లా కమిటీలలో వివిధ స్థాయిల్లో పార్టీ పదవులు నిర్వహిస్తున్న నాయకులకు గుర్తింపు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్.నిసార్ అహ్మద్ మాట్లాడుతూ పార్టీ కేంద్ర నాయకత్వం ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా,గర్వంగా ఉందన్నారు.పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కల్పించడంతో పాటు వారికి బాధ్యతలను మరింత స్పష్టంగా తెలియజేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పార్టీలో వివిధ స్థాయిల్లో పదవులు పొందిన నాయకులు గుర్తింపు కార్డులను కేవలం అలంకార ప్రాయంగా ధరించకుండా, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని నిసార్ అహ్మద్ సూచించారు.పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం నాయకులు ,కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచడం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరింత పటిష్టమైన పునాది నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి నాయకుడు,ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డిని 2029లో తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు,కార్యకర్త లక్ష్యంగా పనిచేయాలని ఎస్.నిసార్ అహ్మద్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పరిశీలకులు అనూషా రెడ్డి,జింకా చలపతి,వైకాపా రాష్ట్ర కార్యదర్శి డి.ఉదయకుమార్,మాజీ మున్సిపల్ చైర్మన్ మనుజా రెడ్డి,ఎస్.ఈ.సి సభ్యురాలు షమీమ్ అస్లాం,మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏ కరీముల్లా,జడ్పిటీసిసి హెచ్.రామచంద్రా రెడ్డి వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూరి రఘునాథ్ రెడ్డి,కార్యదర్శి వి.ఎస్.రెడ్డి,డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి,ఎస్.కె ఇర్ఫాన్,ఆవుల మల్లికార్జున,గార్ల చంద్రమౌళి,కోటూరు ఈశ్వర్,దండాల రవిచంద్రా రెడ్డి,మండల కన్వీనర్లు కేశవ రెడ్డి,కరుణాకర్ రెడ్డి,కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి,మాజీ కౌన్సిలర్లు పాల్ చంద్రశేఖర్,ఎశ్రీనివాసులు మాజీ సర్పంచ్ వలసపల్లి నాగరాజ రెడ్డి,ముజీబ్,శీలం రమేష్,డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి,కొత్తపల్లి నాగార్జున నాయుడు,ఆవుల విశ్వనాథ్,శారదా రెడ్డి,వినుతా బాయి, మంజుల,ముజీబ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసీమ

# మాదకద్రవ్యాలపై పోలీసుల ముమ్మర నిఘా

**డిటెక్షన్ బస్సుతో గంజాయి వేట.. నమూనాల పరీక్షలు.. యువతకు హెచ్చరిక**

**పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు పుల్లంపేటలో గంజాయి వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, ఎస్ఐ చిన్న రెడ్డెప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక గంజాయి డిటెక్షన్ బస్సు ద్వారా అనుమానితుల నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు.గంజాయి విక్రయం, సరఫరా, వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.






# కులం తప్పుల సవరణపై ప్రత్యేక గ్రామసభ

**- ఎంపిడిఓ కుళాయమ్మ**

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో కులం తప్పుల సవరణపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించినట్లు ఎంపిడిఓ కుళాయమ్మ వెల్లడించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపుకు క్షేత్రస్థాయిలో సర్వే చేశామని, అందులో కులం గుర్తింపు ఏదైనా తప్పుగా నమోదై ఉంటే సవరణ చేసేందుకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో కులం తప్పుగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వీటిని సవరణ చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య, టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అన్నిరంగాల్లో ఉత్తమంగా రాణించాలి

**- ట్రిపుల్ ఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు**

**వేంపల్లె ప్రజాసీమ:**

విద్యార్థులు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో ఉత్తమంగా రాణించాలని ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్ ఆకాంక్షించారు. శుక్రవారం ఆర్కేవ్యాలి క్యాంపస్ లో విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలు ప్రదర్శించారు. మొత్తం 119 జట్లు పోటీల్లో పాల్గొన్నారు. ఆ జట్ల నుంచి 50 ఉత్తమ జట్లను ఎంపిక చేసి, జాతీయ స్థాయికి పంపుతామని డైరెక్టర్ వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆవిష్కరణలు, విప్లవాత్మక ఆలోచన శక్తి బహిర్గతం అవుతాయని, ఆర్జీయూకేటి ప్రతిష్ట మరింత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డా.రవికుమార్, అకాడమీక్ డీన్ రమేష్ కైలాస్, సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ఉదయశ్రీ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# వినాయక మండపాలు నిర్వాహణ కు అనుమతులు తీసుకోండి!

**పుంగనూరు ప్రజాసీమ :**

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఉత్సవాలు నిర్వహించే వారు పోలీసుల అనుమతి పొందాలని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఉత్సవాల కోసం ఏర్పాటు చేసే మండపాలు, నిర్వాహకుల వివరాలతో ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసి అనుమతి పొందాలన్నారు. వినాయకుడి ఏర్పాట్లతో పాటు నిమజ్జనం తేదీ వివరాలు కూడ ధరఖాస్తులో తెలపాలన్నారు.



# ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు





**- స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా**

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని అనపగుట్ట,గోవర్ధనగిరిపై వెలసిన శ్రీకృష్ణ పరమాత్ముడి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొని ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి ప్రజలతోపాటు రాష్ట్ర ప్రజలందరికీ శ్రీకృష్ణుడి ఆశీస్సులు ఉండాలని తెలిపారు.ప్రస్తుతం వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో బోర్లలో నీటిమట్టాలు తగ్గిపోతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.దేవుని దయతో త్వరలోనే సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు,ప్రజలకు ఇబ్బందులు తొలగిపోవాలని కోరారు.ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగుతూ మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం,మదనపల్లి ప్రాంతం సుభిక్షంగా ఉండాలని,ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు కలగాలని శ్రీకృష్ణుడిని ప్రార్థించినట్లు తెలిపారు.కృష్ణాష్టమి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ,సమాజంలో శాంతి,సౌభ్రాతృత్వం,ఐక్యత మరింత బలపడాలని,అన్నిమతాల వారు కలిసికట్టుగా ముందుకు సాగి మతసామరస్యాన్ని చాటాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నవీన్ చౌదరి,రాగినేని రఘుపతి నాయుడు,డ్యాన్స్ రెడ్డెప్ప,జెసిబి వేణు,రెడ్డి రాయల్ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జెండా మోసినోడికి కూపన్ కూడా లేదా!

**-జనసేనలో కార్యకర్తల అసంతృప్తి బహిర్గతం**

**-పదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తకు వరలక్ష్మీ వ్రతం కూపన్ దక్కలేదని ఆవేదన**

**14వ వార్డులో కూపన్లు పంపిణీ చేయలేదంటూ ప్రజల నిలదీత-**

**ఎన్నికల వేళే కార్యకర్తలు.. ఆ తర్వాత పట్టించుకోరా?**

**పార్టీ కోసం సొంత డబ్బులు ఖర్చు చేసినా గుర్తింపు లేదంటూ ఆవేదన**

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలుజెండా మోసిన చేతులకే గుర్తింపు కరువైందా? ఎన్నికల సమయంలో పార్టీ కోసం రేయింబవళ్లు తిరిగిన కార్యకర్తలకు చివరకు ఓ కూపన్ కూడా దక్కదా? జనసేనలో తాజాగా చోటుచేసుకున్న ఓ పరిణామం పార్టీ కేడర్‌లో చర్చకు దారితీసింది. పిఠాపురంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతం కార్యక్రమానికి సంబంధించి కూపన్ల పంపిణీలో తమకు అన్యాయం జరిగిందంటూ ఓ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేయడం కలకలం రేపుతోంది. 2015 నుంచి జనసేన కోసం పనిచేస్తున్న తనకు కూపన్ జాబితాలో పేరు లేకపోవడంతో పాటు, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 14వ వార్డులోనూ కూపన్ల పంపిణీ జరగలేదని సదరు కార్యకర్త ఆరోపించారు. దీనిపై స్థానికులు ప్రశ్నించడంతో విషయం బయటకు వచ్చినట్లు సమాచారం. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే.. క్షేత్రస్థాయిలో పనిచేసే కేడర్ పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**2015 నుంచి.. జెండానే జీవితం!**

పవన్ కల్యాణ్ ఆశయాలు, జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితుడై 2015 నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నట్లు సదరు కార్యకర్త తెలిపారు. పార్టీ కార్యక్రమాల కోసం సొంత సమయం, సొంత డబ్బు వెచ్చించానని చెప్పారు. కుటుంబ అవసరాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాలకు హాజరైన సందర్భాలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు.

2019 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించానని, గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లానని తెలిపారు.

**ఎన్నికలొస్తేనే గుర్తు వస్తారా?**

2024 ఎన్నికల్లోనూ నాయకులు, కార్యకర్తలు, యువతతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేసినట్లు చెప్పారు. అంతేకాకుండా 2019, 2021, 2024 ఎన్నికల్లో కౌంటింగ్ ఏజెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించినట్లు తెలిపారు.

పార్టీ కార్యక్రమాల నిర్వహణకు పలుమార్లు సొంత డబ్బులు ఖర్చు చేశానని, అయినప్పటికీ కనీస గుర్తింపు దక్కకపోవడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**సేవలోనూ.. పోరాటంలోనూ ముందే!**

రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు తదితర సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నట్లు సదరు కార్యకర్త తెలిపారు. ఆపదలో ఉన్న ప్రజలకు తనవంతు సహాయం చేస్తూ పార్టీ కార్యకర్తగా ప్రజల మధ్య పనిచేశానని చెప్పారు.

**కేడర్‌లో 'కూపన్' కాక.. అసంతృప్తి!**

వరలక్ష్మీ వ్రతం కూపన్ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక కూపన్‌కు సంబంధించిన అంశంగా కాకుండా పార్టీలో కార్యకర్తలకు దక్కుతున్న గుర్తింపు, ప్రాధాన్యతపై చర్చకు దారితీస్తోంది. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలను విస్మరిస్తే భవిష్యత్తులో కేడర్‌లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. "పార్టీ కష్టకాలంలో మేముంటే.. పార్టీ బలపడిన తర్వాత మాకు చోటెక్కడ?" అన్న భావన కార్యకర్తల్లో కలగకుండా నాయకత్వం జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పార్టీ పెద్దలు దృష్టి సారించేనా?**

వరలక్ష్మీ వ్రతం కూపన్ల పంపిణీలో నిజంగా ఏం జరిగిందనే అంశంపై పార్టీ నాయకత్వం విచారణ చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కార్యకర్తలు కోరుతున్నారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన కేడర్‌కు గౌరవం, గుర్తింపు కల్పించకపోతే "కార్యకర్తే పార్టీకి బలం" అనే నినాదం ఆచరణలో ఎంతవరకు ఉందనే ప్రశ్నలు తలెత్తుతాయని పలువురు పేర్కొంటున్నారు.

# శ్రీకృష్ణ పరమాత్ముడి ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా జీవించాలి





**- కనుగొండ మద్దిరెడ్డి,పసుపులేటి చలపతిల ఆకాంక్ష**

**మదనపల్లె (ప్రజా సీమ) :**

శ్రీకృష్ణ పరమాత్ముడి ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా జీవించాలని తంబళ్లపల్లి మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి,కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతిలు పేర్కొన్నారు.శుక్రవారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని అనపగుట్టలోని గోవర్ధనగిరి నందు వెలసిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణ పరమాత్మున్ని వారు దర్శించుకున్నారు. వారితోపాటు పసుపులేటి చలపతి సతీమణి మాజీ సర్పంచ్ పసుపులేటి పార్వతమ్మ,యువ నాయకుడు చార్టెడ్ అకౌంటెంట్ పసుపులేటి శశి కుమార్,రైస్ మిల్ శశి,మాజీ వార్డు మెంబర్ నాగరాజ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.ముందుగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి స్వామివారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా కనుగొండ మద్దిరెడ్డి, పసుపులేటి చలపతిలు మాట్లాడుతూ ప్రతి ఏడాది గోవర్ధనగిరిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ అని ఈ ఏడాది సైతం ఆలయ కమిటీ సభ్యులు కృష్ణాష్టమి వేడుకలను బ్రహ్మాండంగా నిర్వహించారని ప్రశంసించారు.గోవర్ధనగిరి శ్రీకృష్ణుని ఆలయం రాయలసీమ జిల్లాలకే తలమానికమని కొనియాడారు.ఆ కృష్ణ పరమాత్ముడి కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి,పంటలు బాగా పండాలని తద్వారా ప్రతి ఇంట సిరిసంపదలు తులతూగాలని ఆకాంక్షించారు.

# ఉచిత గుండె వైద్య పరీక్ష శిబిరానికి స్పందన!

**పుంగనూరు ప్రజాసీమ :**

పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య పరీక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. స్థానిక సరళ హోమియో ఆసుపత్రిలో జరిగిన శిబిరానికి 85 మంది జబ్బులు కలిగిన వారు హాజరైయ్యారు. ఆర్ఎల్ జాలప్ప నారాయణ హార్ట్ సెంటర్ వైద్యులు చికిత్సలు నిర్వహించారు. ఇందులో 18 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డైరెక్టర్ డాక్టర్ శివ, క్లబ్ అధ్యక్షులు మహేంద్రరావు, కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, కోశాధికారి సుధాకర్‌రావు, సభ్యులు వరదారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ గవరసాన సేవలు చిరస్మరణీయం

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలువిద్య,వైద్య రంగాలకు ప్రవాస భారతీయులు,ప్రముఖ క్యాన్సర్ పరిశోధకులు డాక్టర్ గవరసాన సత్యనారాయణ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు.డాక్టర్ గవరసాన జయంతిని శుక్రవారం గొల్లప్రోలు లోని స్వామి వివేకానంద జ్ఞాన మందిరంలో స్వచ్ఛ గొల్లప్రోలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గవరసాన చిత్రపటానికి పలువురు పూలమాలు వేసి నివాళులర్పించారు.అనంతరం పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు.అలాగే స్థానికంగా ఒక పాఠశాల ఏర్పాటు చేసి అభివృద్ధి చేయడంతో పాటు,మరో పాఠశాల అభివృద్ధికి ఆర్థికంగా సహకారం అందించారన్నారు.రైతు సమస్యల పరిష్కారం కోసం సైతం పాటు పడ్డారని తెలిపారు.డాక్టర్ గవరసాన సేవలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమాజ సేవకు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద జ్ఞాన మందిరం వ్యవస్థాపకులు పడాల కన్నారావు, మాజీ ఎంపీపీ వర్ధనపు వీర్రాజు, ప్రముఖ యోగా గురువు డాక్టర్ జ్యోతుల నాగేశ్వరరావు,స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొసిరెడ్డి రాజా, సభ్యులు కొమ్ము సత్యనారాయణ, చోడపునీడి పుల్లపరాజు, కర్రి కొండలరావు,పడాల బాలరాజు, కంకటాల వాసు,గుదే నాగు, బోడకుర్తి మహేష్,పెదిరెడ్ల వెంకట్రాజు,చేదులూరి సత్యనారాయణ,మైనం రాజ శేఖర్,గొల్లప్రోలు చరితామృతం గ్రంథ రచయిత బొజాజ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీకృష్ణ పరమాత్ముడి కృపాకటాక్షాలు ప్రజలపై ఉండాలి

## - రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు తుర్లు ఆనంద్ యాదవ్ ఆకాంక్ష

**మదనపల్లె (ప్రజా సీమ) :**

శ్రీకృష్ణ పరమాత్ముడి కృపాకటాక్షాలు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఏపీ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుర్లు ఆనంద్ యాదవ్ పేర్కొన్నారు.శుక్రవారం పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు తుర్లు ఆనంద యాదవ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జిగ గోపాల్ యాదవ్ తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆనంద యాదవ్ మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.యాదవులు ఆర్థికంగా,రాజకీయ పరంగా,విద్యాపరంగా రాణించాలని ఆకాంక్షించారు.శ్రీకృష్ణ పరమాత్ముడి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని,తద్వారా పంటలు బాగా పండి రైతుల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలన్నారు.అదేవిధంగా రాష్ట్రం అన్నిరంగాల్లో ముందంజ వేయాలని కోరుకున్నారు.యాదవుల సంక్షేమం,అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మల్లికార్జున యాదవ్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటా తెలుగుదేశం.. గారాలమడుగులో ప్రజలతో మమేకమైన టీడీపీ నాయకులు

## డోర్ టు డోర్ ప్రచారంలో పాల్గొన్న మండల టీడీపీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, రైల్వేకోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సూచనలతో పుల్లంపేట మండలం గారాలమడుగులో 'ఇంటింటికి తెలుగుదేశం' డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల టీడీపీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, పోలి రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకున్నారు. గ్రామంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి జరుగుతోందని, మంచి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని నాయకులు కోరారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై స్థానికులతో చర్చిస్తూ ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ ముస్తఫా, అయూబ్, మహబూబ్‌నిసా, ఇమాంబీ, ఫాతిమా, బాలరాజు శివకుమార్ రాజు, బద్రి, మునికుమార్ రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

## - శ్రీకృష్ణుడిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు శ్రీలక్ష్మి వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఇఓ కడప సుభాష్ వెల్లడించారు. శుక్రవారం ఆలయ అర్చకుడు తిరుమల వేణు నేతృత్వంలో స్వామి వారిని కృష్ణుడిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ పివి రమణ పర్యవేక్షణలో అర్చకులు హరిప్రవీణ్, తిరుమల వేణు ఆరాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చిన్నారులతో ఏర్పాటు చేశారు. చిన్నారులు రాధకృష్ణులు, గోపికల వలె అందమైన వేషధారణలతో



# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న శ్రీరామ్ చినబాబు

## - గోవర్ధనగిరిలో ప్రత్యేక పూజకార్యక్రమాలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని అనపగుట్ట నందు గల గోవర్ధనగిరి శ్రీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ శ్రీకృష్ణుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు,ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.గోవర్ధనగిరి ఆలయంలో జన్మాష్టమి వేడుకలను ఆలయ కమిటీ అధ్యక్షులు గురుశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో అద్భుతంగా నిర్వహించారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేష్,శ్రీనాథ్ రెడ్డి,హేమంత్,అశోక్,రాజశేఖర్,బీజేపీ యువ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



# హస్తవరంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**రాజంపేట (ప్రజా సీమ):**

రాజంపేట మండలం పరిధిలోని హస్తవరం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా, కన్నులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే (ఉట్టి ఉత్సవం) కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకుడు శివ మాట్లాడుతూ.. కృష్ణాష్టమి విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలో భక్తిశ్రద్ధల నడుమ పండుగ వాతావరణం నెలకొంది.



# వైఎస్సార్ జిల్లా: ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల్లో అక్రమ మట్టి తవ్వకాలు

**రాజంపేట (ప్రజా సీమ):**

వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల పరిధిలో హైవే నిర్మాణం పేరుతో అక్రమ మట్టి తోలకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకపోయినా నిర్వాహకులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రభుత్వ నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. మంటపంపల్లి, ఎస్.కే.ఆర్ నగర్ సమీపంలోని రైతుల భూముల్లో భారీ ఎత్తున అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతూ తరలిస్తున్నారు. ఈ క్రమంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను ఎస్.కే.ఆర్ నగర్ ప్రాంతానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన హైవే నిర్వాహకుని అనుచరులు, వాహనాలను అడ్డుకున్న రైతులపై దౌర్జన్యానికి దిగి, దాడి చేసేందుకు యత్నించారు. ఈ ఘటనపై స్థానిక రైతులు రాజంపేట సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక సీఐ వెంకటేశ్వర్లును మీడియా ప్రతినిధులు చరవాణిలో వివరణ కోరగా, రైతుల నుంచి ఫిర్యాదు అందిందనేది వాస్తవమేనని ధృవీకరించారు. హైవే నిర్వాహకులు వాసుదేవరెడ్డి, చంద్రశేఖరరెడ్డితో పాటు మరికొందరిపై రైతులు ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. ఘటనపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.



# భక్తులతో కిటకిటలాడిన గోవర్ధనగిరి శ్రీకృష్ణ ఆలయం

## - ఆలయ ట్రస్ట్ చైర్మన్ గురుశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు

## - అన్నదానం,సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లి సమీపంలోని శ్రీవారి నగర్,అనపగుట్ట గోవర్ధనగిరి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి.ఆలయ ట్రస్ట్ చైర్మన్ గురుశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక అభిషేకం,అర్చన,శ్రీకృష్ణ కళ్యాణోత్సవం,వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు.అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు,భక్తుల ప్రసంగాలు,భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ త్వరలోనే ఆలయానికి రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన్న బాబు మాట్లాడుతూ ఆలయానికి కుటుంబ ప్రభుత్వం తరపున సహకారం కావాలన్నా తన వంతు ఎప్పుడు కృషి చేస్తానని తెలిపారు.కృష్ణాష్టమి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మదనపల్లి డిఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో టూ టౌన్ సిఐ మహమ్మద్ రఫీ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మదనపల్లి శాసన సభ్యులు షాజహాన్ బాషా,తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే ఇంచార్జ్ శంకర్ యాదవ్,మార్కెట్ యార్డ్ చైర్మన్ జంగాల శివరామ్,బిజెపి నాయకులు బండి ఆనంద్,జర్మనీ రాజు,విజయ భారతి స్కూల్ అధినేత సేతు,కనుగొండ మద్దిరెడ్డి,చిప్పిలి మాజీ సర్పంచ్ చలపతి,టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# పిఠాపురంలో ఈ నెల 9న బ్రహ్మర్షి హుస్సేన్ షా జయంతి సభ - 'హుస్సేన్ షా కవి పురస్కారాల' ప్రదానం

**పిఠాపురం:(ప్రజా సీమ )**

స్థానిక పిఠాపురం ఆశ్రమంలో ఈ నెల 09-09-2026 (బుధవారం) ఉదయం 9 గంటలకు శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నేతృత్వంలో, డా. ఉమర్ ఆలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో బ్రహ్మర్షి శ్రీ హుస్సేన్ షా గారి 121వ జయంతి సభను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు నవమ పీఠాధిపతులు, సమితి అధ్యక్షులు డాక్టర్ ఉమర్ ఆలీషా, సమితి కార్యదర్శి శ్రీ దాయన చంద్రజీ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు.ఈ జయంతి సభలో భాగంగా ప్రముఖులకు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను, సత్కారాలను అందజేయనున్నారు. చెన్నైకి చెందిన ప్రముఖ ఆచార్యులు శ్రీ విస్తాలి శంకర్ రావు గారికి, హైదరాబాద్‌కు చెందిన శ్రీమతి లక్ష్మీ కాంతి వేమూరి (గిడుగు) గారికి ఈ ఏడాది 'శ్రీ హుస్సేన్ షా కవి పురస్కారాలు' అందజేయనున్నారు. ఈ పురస్కారం కింద వీరికి ఒక్కొక్కరికి రూ. 50,116 ల నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందించి సత్కరిస్తారు.అదేవిధంగా సమాజంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన నలుగురు ప్రముఖులకు 'విశిష్ట సేవాభినందన సత్కారాలు' అందజేయనున్నారు. ఈ సత్కారానికి ఎంపికైన:శ్రీ త్సవటపల్లి మురళీకృష్ణ, శ్రీ పేరూరి సూరిబాబు, డాక్టర్ పింగళి ఆనంద కుమారి, శ్రీమతి కె. స్వర్ణలతగార్ల కు ఒక్కొక్కరికి రూ. 10,116 ల నగదు పురస్కారంతో పాటు ఘన సన్మానం జరుగుతుందని పీఠం కన్వీనర్ శ్రీ పేరూరి సూరిబాబు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ ఆధ్యాత్మిక, సాహిత్య కార్యక్రమంలో భక్తులు, సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.



# కొణిదెల వారి ఇంట్లో చిన్ని కృష్ణుడు సందడి



మెగా హీరో రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ ముగ్గురు పిల్లలతో కలిసి కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. తమ కుమారుడు, కూతుర్లను శ్రీకృష్ణుడు, రాధారాణి వేషధారణలో అలంకరించి పూజలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫొటోను మెగా కోడలు ఉపాసన సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. "కల నెరవేరింది. నిజంగా ధన్యమైనది. ఓం నమో భగవతే వాసుదేవాయ. అందరికీ జన్మాష్టమి శుభాకాంక్షలు" అని ఉపాసన ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. ఇందులో చెర్రీ – ఉపాసన దంపతులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి, తమ పూజా మందిరంలో విగ్రహాల ముందు కూర్చుని పూజ చేస్తూ కనిపిస్తున్నారు. తమ కవల పిల్లలను ఒళ్లో కూర్చొని పెట్టుకుని పూజా కార్యక్రమంలో పాల్గొంటుండగా, వారి పెద్ద కుమార్తె క్లిన్ కార తన తల్లిదండ్రులు మధ్య కూర్చుని ఉంది. ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'కొణిదెల వారి ఇంట్లోకి చిన్ని కృష్ణుడు అడుగుపెట్టాడు' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఉపాసన షేర్ చేసిన ఫొటోలో తమ ముగ్గురు చిన్నారుల ఫేస్ కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. అయినప్పటికీ 'కొణిదెల వారి ఇంట్లోకి చిన్ని కృష్ణుడు అడుగుపెట్టాడు' అంటూ మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెగా కపుల్ కి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు చెబుతూ కామెంట్లు చేస్తున్నారు. మెగా ఫ్యామిలీ కృష్ణాష్టమి స్పెషల్ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రామ్ చరణ్ – ఉపాసన దంపతులు 2023 జూన్ 20న క్లీంకారకు జన్మనిచ్చారు. ఈ ఏడాది జనవరి 31న వీరికి కవలలు జన్మించారు. బాబుకి శివరామ్, పాపకి అన్వీరా దేవి అని పేర్లు పెట్టారు. ట్విన్స్ రాకతో మెగా ఫ్యామిలీలో ఆనందాలు వెల్లువెత్తాయి. కొణిదెల ఫ్యామిలీలోకి మూడో తరం వారసుడు వచ్చాడని మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, రామ్ చరణ్ ఇటీవల బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'లో కనిపించారు. ఈ పాన్ ఇండియా సినిమా బాక్సాఫీస్ దగ్గర రూ.400 కోట్ల గ్రాస్ రాబట్టినట్లు మేకర్స్ ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలో చెర్రీ ఓ సినిమాని ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లలో భారీ బడ్జెట్ తో ఈ చిత్రం తెరకెక్కనుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. చరణ్ ఈ మధ్యనే సర్జరీ చేయించుకోవడంతో,ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాత సినిమాని సెట్స్ మీదకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు.

# నోరుపారేసుకున్న నటి కస్తూరి



కొందరు సెలబ్రిటీలు ఏం మాట్లాడినా, ఏం చేసినా ఖచ్చితంగా వివాదాస్పదం అవుతుంది. ఈ కోవలోకే వస్తారు తమిళ నటి కస్తూరి శంకర్. మనసులో ఎలాంటి భావం ఉన్నా ఉన్నది ఉన్నట్లు ముఖం మీద చెప్పడంతో ఈమె ముందు వరుసలో ఉంటారు. తొలి నుంచి డేరింగ్ అండ్ డాషింగ్ బిహేవియర్‌తో ఏరికోరి వివాదాల్లో చిక్కుకున్నారు కస్తూరి. సినీరంగంలో మహిళలపై వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్‌తో పాటు తమిళనాడులో ఉంటున్న తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి జైలుకు కూడా వెళ్లొచ్చారు. ఆ తర్వాత కాస్త సైలెంట్ అయినప్పటికీ తిరిగి యాక్టీవ్ అయ్యారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తుతం హీరో పాత్రలను చూపిస్తున్న విధానంపై కస్తూరి శంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1991లో ఆతా ఉన్ కోయిలే సినిమా ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఆమె.. మూడున్నర దశాబ్ధాల కెరీర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వందకు పైగా చిత్రాల్లో నటించారు. నిప్పు రవ్వ, గాడ్ ఫాదర్, సొగ్గాడి పెళ్లాం, మెరుపు, చిలక్కొట్టుడు, అన్నమయ్య, మా ఆయన బంగారం, ఆకాశ వీధిలో, డాన్ శీను, శమంతకమణి, సింబా వంటి సినిమాలతో తెలుగువారిని పలకరించారు. కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకున్న కస్తూరి ఆ తర్వాత తన కెరీర్‌కు కొన్నాళ్లు బ్రేక్ ఇచ్చి ఫ్యామిలీ, పిల్లల కోసం అంకితమయ్యారు. ఇటీవల సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన కస్తూరి.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారిపోయారు. సినిమాలే కాదు బుల్లితెరపైనా ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరిస్తున్నారు. తెలుగులో ఆమె నటించిన గృహలక్ష్మి సీరియల్.. ప్రేక్షకులకు కస్తూరిని దగ్గర చేసింది. ప్రస్తుతం ధర్మస్థల నియోజకవర్గం అనే తెలుగు మూవీలో కస్తూరి శంకర్ నటించారు. ఇందులో నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో కస్తూరి నటించినట్లుగా వార్తలు వస్తున్నాయి. మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ బ్యానర్‌పై మేరుం భాస్కర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర, వరుణ్ సందేశ్, వితికా షేరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషించారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 4న ధర్మస్థల నియోజకవర్గం మూవీ వరల్డ్ వైడ్‌గా విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్ కార్యక్రమాల్లో భాగంగా చిత్ర యూనిట్ ఓ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడారు. ఈ మధ్యకాలంలో అన్ని రకాల సినిమాలు వస్తున్నాయి. సినిమాను సినిమాగానే చూడాలని ఒకపక్క ఉంది. తెలుగు సినిమాలు చూస్తూ పెరిగిన దానిని, మాయాబజార్.. కృష్ణార్జున యుద్ధం, ప్రేమాభిషేకం లాంటి సినిమాలు చేసి పెరిగాను. అప్పుడు చూస్తే తెలుగు సినిమాల్లో హీరోలంటే దేవుడు.. దేవుడి అవతారాలు కనిపించేవి. ఆ తర్వాత సాంఘిక చిత్రాలు వచ్చాయి. వాటిలో హీరో పోలీస్, లాయర్, విప్లవకారుడు, న్యాయం కోసం పోరాడే వ్యక్తిగా కనిపించాడు. ఇప్పుడొచ్చే సినిమాల్లో స్మగ్లర్, క్రిమినల్, గ్యాంగ్‌స్టర్ అలాంటి సినిమాలే వస్తున్నాయి. ఇలాంటి వాటి మధ్య ఒక సామాజిక బాధ్యతతో, సామాజిక సందేశంతో వస్తున్న మూవీ అంటే చాలా అరుదు అన్నట్లుగా మారిపోయింది. అలాంటి సినిమాల్లో మా ధర్మస్థల నియోజకవర్గం కూడా ఒకటి అని కస్తూరి చెప్పారు. డైరెక్టర్ ప్రభ గారు నా దగ్గరికి వచ్చిన స్టోరీలో ఒక లైన్ చెప్పారు. అప్పుడే ఆ స్టోరీ నాకు బాగా నచ్చేసింది. నిర్మాత భాస్కర్ గారు ఏఎం రత్నంగారి టీమ్.. నన్ను తెలుగువారిని పరిచయం చేసింది భారతీయుడు చిత్రం. ఆ కనెక్షన్ కూడా నాకుంది. భారతీయుడు, అన్నమయ్య లాంటి సినిమాలు చేసి ఆ తర్వాత పెళ్లి చేసుకుని ఫారిన్‌కి వెళ్లిపోయా. ఇప్పుడు మళ్లీ తిరిగొచ్చి గృహలక్ష్మిగా అందరికి దగ్గరైన కస్తూరిని ఈ సినిమాలో ఎలా చూపిస్తారో అనుకున్నాను. కానీ ఆయన వచ్చి నన్ను దారుణమైన నెగిటివ్ క్యారెక్టర్ చేయించడంతో షాకయ్యా. నేను ఇప్పటి వరకు ఇలాంటి రోల్‌లో అస్సలు చేయలేదు. కస్తూరి అంటే మా ఇంటి ఆడపిల్ల అని అందరూ అనుకునేవారు.. కానీ ఈ సినిమాలో చీర కూడా కట్టనివ్వలేదు అని కస్తూరి తెలిపారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి.

# పనిపాటా లేనివాళ్లకే ఓటీటీలు



సీనియర్ నటుడు శివాజీ పేరు ఇటీవలి కాలంలో వివాదాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. మనసులో ఉన్నది ఉన్నట్లు ముఖం మీద కొట్టినట్లు మాట్లాడటం శివాజీ స్టైల్. ఈ విషయంలో ఎవరు ఏమనుకున్నా ఆయన వెనక్కి తగ్గరు. ఆ ముక్కుసూటితనమే వివాదాలకు కారణమవుతోంది. గతేడాది చివరిలో దండోరా సినిమా ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణ గురించి శివాజీ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు తోడు ఏకంగా మహిళా కమీషన్ వరకు విషయం వెళ్లింది. ఆ తర్వాత ఈ వివాదం నెమ్మదిగా సద్దుమణిగింది. తాజాగా ఓటీటీలపై శివాజీ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ వివరాల్లోకి వెళితే.. భారతదేశాన్ని కరోనా మహమ్మారి కమ్మేసినప్పుడు అందుబాటులోకి వచ్చిన ఓటీటీలు దేశంలోని వినోద రంగంపై పెను ప్రభావాన్ని చూపించాయి. అప్పట్లో థియేటర్‌కు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు వినోదం కోసం ఓటీటీపైనే ఆధారపడ్డారు. ఆ తర్వాత లాక్‌డౌన్ ఎత్తివేసి థియేటర్లు తెరిచినా అటు వైపు వెళ్లడానికి ప్రేక్షకుడు అంతగా ఆసక్తి చూపించలేదు. పెరిగిన టికెట్ ధరలు, తినుబండారాల ధరలు సామాన్యుడికి వణుకు పుట్టించాయి. అంత ఖర్చుపెట్టి సినిమా థియేటర్‌కు వెళ్తే చెత్త కంటెంట్‌తో మేకర్స్ విసుగు తెప్పిస్తున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టే కంటే అతి తక్కువ ఖర్చుతో ఇంట్లోనే కుటుంబ సభ్యులంతా కలిసి చూసేలా ఓటీటీలు వినోదాన్ని అందిస్తుండటంతో ప్రేక్షకుడు ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. ఒక్క భాషకు పరిమితం కాకుండా ప్రపంచం నలుమూలలకు చెందిన ఒరిజినల్ కంటెంట్‌ను ఆస్వాదించే అవకాశం కలిగింది. భారతదేశంలో ఓటీటీ మార్కెట్ గిరాకిని గుర్తించిన అనేక బడా కంపెనీలు ఇక్కడి సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇతర ఒరిజినల్ కంటెంట్‌ను దక్కించుకుని ప్రేక్షకుడిని ఆకట్టుకుంటున్నాయి. నిర్మాతలకు ఓటీటీ రైట్స్ రూపంలో అదనపు లాభాలు రావడంతో వారు కూడా వీటిని ప్రోత్సహించారు. అయితే ఆ తర్వాత ఓటీటీ కంపెనీలు.. సినిమాలు ఎప్పుడు విడుదల చేయాలో డిసైడ్ చేసే స్థాయికి చేరుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మంచి సినిమాలు వస్తుండటంతో ఇప్పుడిప్పుడే ప్రేక్షకులు తిరిగి థియేటర్ బాట పడుతున్నారు. కాగా.. ఆనంద్ దేవరకొండ– వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కిన మూవీ ఎపిక్– ఫస్ట్ సెమిస్టర్. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ బ్యానర్‌పై సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా.. అజీమ్ మొహమ్మద్ సినిమాటోగ్రాఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఎపిక్ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషనల్ కార్యక్రమాలు వేగవంతం చేసింది. దీనిలో భాగంగా ఈ మూవీ టీమ్ ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు శివాజీ ఓటీటీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓటీటీలలో కూడా డబ్బులు బాగా పెంచారు, డబ్బులు కట్టాలి ఫ్రీగా ఇవ్వరు. ఓటీటీ అనేది బాగా ఫ్రీగా ఉన్నోళ్లకి, ఇంట్లో ఉండి ఏం పోతాంలే అనుకునే లేజీగా ఉన్నోళ్లకే. సినిమా అనేది ఒక అద్భుతం. అంత పెద్ద థియేటర్‌లో మనమంతా ఎవరం అనేది మరిచిపోయి ఒక సినిమాను 200, 300 మంది మధ్యలో కూర్చొని చూస్తుంటే ఆ మజా, కిక్. అంతేకానీ ఇంట్లో కూర్చొని నీకు అవసరమైనప్పుడు జోమోటా వాడొచ్చాడు, స్విగ్గీ వాడొచ్చాడని బయటికి వెళ్లి వస్తుంటారు. ఏది ఏమైనా థియేటర్ థియేటరే. ఏం చెప్పినా కూడా థియేటర్‌లో సినిమా చూస్తుంటే ఆ కిక్కే వేరు. ఆ రోజు భయపడ్డారు కానీ నేను నటించిన 90'స్ మూవీ థియేటర్‌లో రిలీజ్ చేసుంటే 100 కోట్ల రూపాయలు కలెక్ట్ చేసేది. అలాగే ఇప్పుడు ఈ సినిమా కూడా థియేటర్‌లో చూస్తుంటే యూత్ పిచ్చెక్కిపోతారు. వైష్ణవి క్యారెక్టర్‌కి చాలా బాగా కనెక్ట్ అవుతారు.. మా వాడి క్యారెక్టర్‌కి అయితే ప్రతివాడు వాడే అవుతాడు అని శివాజీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరి దీనిపై సినీరంగం నుంచి ఎలాంటి రియాక్షన్స్ వస్తాయో చూడాలి.

# తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా



బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రవితేజ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నడూ టచ్ చేయని 'హారర్ కామెడీ' జోనర్‌లోకి తొలిసారిగా అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా మాస్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ థ్రిల్లర్లతో పాటు పక్కా ఎంటర్‌టైనర్లలో రవితేజ తన మార్క్ చూపించారు. అయితే ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించే హారర్ కామెడీ తరహా పాత్రను ఆయన ఇంతవరకు చేయలేదు. వివేక్ ఆత్రేయ మార్క్ విలక్షణమైన స్క్రీన్‌ప్లే, రవితేజ అసమానమైన ఎనర్జీ, టైమింగ్ తోడైతే వెండితెరపై నవ్వుల విందు గ్యారెంటీ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వివేక్ ఆత్రేయ చిత్రంతో పాటే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా రవితేజ ఖరారు చేశారు. 'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో ఓ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు (శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్) నిర్మిస్తున్న ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు మరో ప్రధాన పాత్రలో సందడి చేయనున్నారు. రవితేజ మార్క్ జోష్‌కు శ్రీవిష్ణు పంచ్‌లు జతకలిస్తే వినోదం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ మల్టీస్టారర్ చిత్రాన్ని 2027 సంక్రాంతి పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. మొత్తానికి హసిత్ గోలి సినిమా పూర్తి కాగానే వివేక్ ఆత్రేయ హారర్ కామెడీ సెట్స్‌పైకి వెళ్లనుంది.

# సౌందర్యను తలచుకుని అర్జున్ ఎమోషనల్



తనదైన నటన, యాక్షన్ సీక్వెన్స్‌లతో సౌత్ సినీ ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్నారు యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా . సుమారు మూడు దశాబ్దాలకు పైగా తెలుగు, తమిళంలో ఎన్నో చిత్రాల్లో నటించిన ఆయన ఎంతోమందిని తన అభిమానులుగా మార్చుకున్నారు. కేవలం యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్‌ని మెప్పించే సినిమాలు తీసి అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తూ వస్తున్నారు. ఇటీవలే 'బ్లాస్ట్'తో మన బాక్సాఫీస్ సత్తా తగ్గలేదని మరోసారి నిరూపించారు. అయితే ఈ ప్రయాణం వెనుక ఆయన పడిన ఎన్నో కష్టాలు, అవమానాలు దాగి ఉన్నాయి. కెరీర్ ఆరంభంలో ఎదురైన ఒడిదుడుకులు, అవకాశాల కోసం చేసిన పోరాటాలు తనను రాటుదేలేలా చేశాయని ఆయన తరచూ గుర్తుచేసుకుంటుంటారు. తాజాగా ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కెరీర్, పరిశ్రమలోని స్నేహితులు, తన జీవితంలో అత్యంత విషాదకర ఘటన గురించి వివరిస్తూ ఎమోషనల్ అయ్యారు.సినీ రంగంలో స్వార్థం లేని స్నేహితులు దొరకడం ఎంతో అరుదని పేర్కొన్న అర్జున్... జగపతిబాబుతో తనకు ఉన్న సన్నిహిత అనుబంధాన్ని ప్రస్తావించారు. అదే క్రమంలో దివంగత నటి సౌందర్య ని గుర్తుచేసుకుంటూ ఆయన కంటతడి పెట్టించే విషయాలను షేర్ చేసుకున్నారు. అందానికి అందం, అంతకుమించిన అద్భుతమైన సహజ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సౌందర్య.. తనకు కేవలం ఒక కో స్టార్ మాత్రమే కాదని, జీవితంలో లభించిన అత్యుత్తమ స్నేహితురాలని అర్జున్ కొనియాడారు. 'ఒకరిని కోల్పోతే కలిగే శూన్యం ఎంతటిదో, 'ఐ మిస్ యూ' అనే చిన్న మాటకు ఎంతటి బరువైన అర్థం ఉందో సౌందర్య మన మధ్య లేకపోవడంతోనే నాకు తెలిసింది' అంటూ ఆయన ఎమోషనల్ అయ్యారు. సౌందర్య భౌతికంగా దూరమైన తర్వాతే తన జీవితంలో ఆమె ఎంతటి స్థానాన్ని ఆక్రమించిందో మరింత లోతుగా అర్థమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్జున్, సౌందర్య కలిసి నటించిన సినిమాలు వెండితెరపై ప్రత్యేకమైన ముద్ర వేశాయి. ముఖ్యంగా 1998లో వచ్చిన కుటుంబ కథా చిత్రం 'శుభవార్త', 2001లో విడుదలైన భక్తిరస చిత్రం 'శ్రీ మంజునాథ'లో వీరిద్దరి మధ్య కుదిరిన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో మెప్పించింది. కేవలం షూటింగ్‌లకే పరిమితం కాకుండా, తెరవెనుక కూడా ఒక ఆప్తురాలిగా సౌందర్య నిలిచారని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండే సౌందర్య వ్యక్తిత్వం, సహజ సిద్ధమైన నటన, మనుషులతో ఆమె మమేకమయ్యే తీరు ఎప్పటికీ మరువలేనివని అర్జున్ ఎమోషనల్ అయ్యారు. ఎన్ని సంవత్సరాలు గడిచినా సౌందర్య జ్ఞాపకాలు, ఆమెతో ఉన్న పవిత్రమైన స్నేహం తన గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

# ఓటీటీలోకి కాంట్రవర్సీ మూవీ

ఇటీవల కొన్ని సినిమాలు విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకుంటున్నాయి. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలు లేదా సంభాషణల విషయంలో కొన్ని సంస్థలు ఈ చిత్రాలను వ్యతిరేకించడంతో అవి థియేటర్లలో విడుదల కావడం లేదు. అలాగే బోల్డ్ కంటెంట్ కారణంగా కూడా కొన్ని సినిమాలు విడుదల కాలేదు. అయితే, ఈ చిత్రాలు ప్రస్తుతం ఓటీటీలో అందుబాటులో ఉన్నాయి. ప్రేక్షకులు కూడా ఈ చిత్రాలను ఓటీటీలో చూసేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. అలా థియేటర్లలో నిషేధానికి గురై ఓటీటీలో సంచలనం సృష్టించిన సినిమా 'అన్‌ఫ్రీడమ్'. బాలీవుడ్ దర్శకుడు రాజ్ అమిత్ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఉగ్రవాదం, మత ఛాందసవాదం, స్వలింగ సంపర్కం, ప్రేమ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి సున్నితమైన అంశాలు ఉన్నాయి. దీంతో 2015లో ఈ చిత్రానికి భారతదేశంలో థియేటర్లలో విడుదలకు ఆమోదం లభించలేదు. 'అన్‌ఫ్రీడమ్' సినిమా కథ వివిధ పాత్రల జీవితాల చుట్టూ తిరుగుతుంది. ఒకవైపు ఇది ఉగ్రవాదం, మత ఛాందసవాదం వంటి సమస్యలను ప్రస్తావిస్తూనే, మరోవైపు తమ సొంత గుర్తింపు, ప్రేమ, తాము కోరుకున్నట్లుగా జీవించే హక్కు కోసం పోరాడుతున్న వ్యక్తుల కథను ఆవిష్కరిస్తుంది.'అన్‌ఫ్రీడమ్' చిత్రాన్ని భారతదేశంలో విడుదల కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ)కి సమర్పించారు. అయితే, చిత్రంలోని కొన్ని సన్నివేశాలు, సున్నితమైన అంశాలపై బోర్డు అభ్యంతరం తెలిపి, పలు మార్పులను సూచించింది. స్వలింగ సంపర్కానికి సంబంధించిన డైలాగులు, శృంగార సన్నివేశాలు, అలాగే ఉగ్రవాదానికి సంబంధించిన కొన్ని సీన్లు, డైలాగులను తొలగించాలని సెన్సార్ బోర్డ్ సూచించింది. అయితే నిర్మాతలు మాత్రం సెన్సార్ బోర్డు సూచించిన మార్పులు చేయడానికి నిరాకరించారు. సన్నివేశాలను లేదా కంటెంట్‌ను మార్చడం వల్ల సినిమా అంతా ఎఫెక్టివ్ గా ఉండదని దర్శక నిర్మాతలు భావించారు. దీని తర్వాత, చిత్ర బృందం సెన్సార్ బోర్డు నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పీల్ చేసింది. అయినప్పటికీ, 'అన్‌ఫ్రీడమ్' చిత్రాన్ని భారతదేశంలోని థియేటర్లలో విడుదల చేయడానికి అనుమతించలేదు. భారతదేశంలో విడుదల కానప్పటికీ 'అన్‌ఫ్రీడమ్' అంతర్జాతీయంగా పలు సినిమా ఈవెంట్లు, ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్ లోనూ ప్రదర్శితమైంది. పలు సున్నితమైన అంశాలను చూపించిన తీరుకు పలు ప్రశంసలు, అవార్డులు కూడా వచ్చాయి. సెన్సార్‌షిప్, భావ ప్రకటనా స్వేచ్ఛ, భారతీయ సినిమాలో సున్నితమైన అంశాల చిత్రీకరణపై చర్చలను రేకెత్తించిన చిత్రాలలో 'అన్‌ఫ్రీడమ్' సినిమాను ఒకటిగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంది.




Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma